క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిటౌన్: విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా కొత్తపేట, నాజరుపేట ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డి–1 సెక్షన్ ఏఈ సి.హెచ్.దుర్గారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెండో రోజు కొనసాగిన ఉద్యోగుల ఆందోళన



తెనాలిఅర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కారాలని కోరుతూ ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో తెనాలి ఆర్టీసీ డిపోలో శనివారం కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హత ఉన్న ఉద్యోగులందరికీ పదోన్నతులు ఇవ్వాలని పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ ఎరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.రాజేష్‌ఖన్నా, డిపో అధ్యక్ష కార్యదర్శులు కె.బాబు, ఎస్.సుధాకర్, నాయకులు వి.ప్రసన్న జ్యోతి, జి.భూలక్ష్మి, కె.విజయలక్ష్మి, బి.కళావతి, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు వి.జోషిబాబు, దీపాల శ్రీనివాసరావు, బ్రహ్మం పాల్గొన్నారు.

సదరన్ స్లాట్ ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పొడిగించాలి

మంగళగిరి టౌన్: సదరన్ స్లాట్ ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు కోరారు. మంగళగిరి నగర పరిధిలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న మీసేవా సెంటర్‌లో సర్వర్ మొరాయించడంతో శనివారం దివ్యాంగులు స్లాట్ దరఖాస్తు కోసం పడిగాపులు కాశారు. అక్కడకు చేరుకున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉదయం నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు కోసం దివ్యాంగులు పడిగాపులు పడుతున్నారని, సర్వర్ సమస్యలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్లాట్ గడువు తేదీని పొడిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలో కొలువైన పద్మావతీ, అలివేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ట 15వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వార్లకు వేద పండితులు వంశీకృష్ణ పంచామృతాలతో అభిషేకాలు చేసి అలంకరించారు. ముఖ మండపంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, కంకణధారణ పూజలు చేసి శాంతి కల్యాణం నిర్వహించారు. పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు ఐలా శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన ఉచిత మెడికల్ క్యాంప్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని నవోదయ కాలనీలో శనివారం దీపక్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పటల్ మేనేజర్ డైరెక్టర్ పి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. గుంటూరు జీజీహెచ్ సహకారంతో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశామని, సుమారు 200 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, దంత, కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. వైద్య శిబిరంలో వైద్యులు ముక్తినేని వెంకట మధుసూదన్‌రావు, వీరేంద్ర, జ్యోతి, దినేష్, రాష్ట్ర అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ కాంట్రాక్టు డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్రైవర్ల కేంద్ర సంఘం సభ్యులు, లైవ్ వెల్‌నెస్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీపై సమావేశం నేడు

తాడేపల్లి రూరల్: బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆదివారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తాడేపల్లి పార్టీ రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్), ఇతర జిల్లా ముఖ్య నాయకులు హాజరుకానున్నారని.. ఉదయం 10.30 గంటలకు తాడేపల్లి పట్టణ పరిధిలోని అంజిరెడ్డి భవన్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అన్ని గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొనాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

క్వాలిటీతోనే రోటరీ ఉత్తమ సేవలకు అవకాశం

- రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ ఉదయ్ సుధీర్ పిలానీ
- తెనాలి రోటరీ క్లబ్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం



నూతన అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావుకు బాధ్యతలు అప్పగిస్తున్న ఉదయ్ సుధీర్ పిలానీ

తెనాలి: విద్యావంతులు, సత్ప్రవర్తన, సేవాభావం కలిగిన వ్యక్తులను మాత్రమే రోటరీ సభ్యులుగా చేర్చుకోవాలని, క్వాలిటీ సభ్యత్వంతోనే క్లబ్ బలీయమైన సేవాసంస్థగా ఎదుగుతుందని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ ఉదయ్ సుధీర్ పిలానీ సూచించారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం 2025–26 సంవత్సరానికి నూతన అధ్యక్షుడిగా నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా గుమ్మడి వెంకట నారాయణ, కోశాధికారిగా వెంపటి హరిప్రసాద్‌ల ప్రమాణస్వీకారోత్సవం శనివారం స్థానిక హోటల్ గౌతమ్ గ్రాండ్‌లో ఘనంగా నిర్వహించారు. విశిష్ట అతిథిగా హాజరైన ఉదయ్ సుధీర్ పిలానీ నూతన పాలకవర్గంచే ప్రమాణం చేయించారు. గతేడాది ఏపీ రీజియన్‌లో రెండో ఉత్తమ క్లబ్‌గా గౌరవాన్ని పొందిన క్లబ్ ఆ ఘనతను కొనసాగించాలని కోరారు. పారిశ్రామిక సంస్థల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) నిధులు సమీకరించగలిగితే విస్తృత సేవలను అందించవచ్చని సూచించారు. ముఖ్యఅతిథి పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అన్నే రత్నప్రభాకర్ తన ప్రసంగంలో ప్రపంచం రకరకాలుగా విడిపోయి యుద్ధాలు జరుగుతున్న నేటి కాలంలో రోటరీ 'యునైట్ ఫర్ గుడ్' థీమ్‌ను తీసుకుందని గుర్తుచేశారు.

పేదరికం నిర్మూలన, సమానత్వం, పర్యావరణం, విద్య వంటి రంగాల్లో పనిచేస్తున్న రొటేరియన్ల అంతిమలక్ష్యం ప్రపంచ శాంతిగా చెప్పారు. అందుకోసం అందరితో కలిసి పనిచేయాలన్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రోటరీలోని ముఖ్యమైన ఏడు సేవలతోపాటు రైతుసదస్సు, దేశవాళీ విత్తనాల భద్రపరచటం, నైపుణ్యశిక్షణ భవన నిర్మాణం, విద్యార్థులకు ఫైనార్ట్స్‌లో శిక్షణ, క్రీడలు, మహిళా సాధికారత వంటి అంశాలపై చర్చించి ముందుకు వెళ్లాలనేది తన భావనగా చెప్పారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ సేవ పరమావధిగా గల రోటరీలో కొనసాగటం అదృష్టంగా చెప్పారు.

అవసరమైన వారికి సాయం చేసినపుడు వారి కళ్లలో వెలుగులు ఎన్నో మెడల్స్‌తో సమానంగా చెప్పారు. తొలుత రోటరీ వ్యవస్థాపకుడు పాల్‌హారీస్ చిత్రపటానికి నివాళి అర్పించారు. పూర్వ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సభానిర్వహణ గుత్తా వెంకటరత్నం నిర్వహించగా ఉపాధ్యక్షురాలు డాక్టర్ డి.జీవనల, ఇతర బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లతోనూ ప్రమాణం చేయించారు. ప్రముఖ చిత్రకారుడు రాయన గిరిధర్‌గౌడ్, డాక్టర్ కె.రామరాజు, దేవయజనం మురళీకృష్ణ మాట్లాడారు. కన్నెగంటి మురళీకృష్ణ స్వాగతం పలికారు.

తెనాలిని సుందరంగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



కాల్వలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: తెనాలిని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 13వ వార్డు యానాది కాలనీలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. వార్డులోని పలు కాల్వలను పరిశీలించి అక్కడ చేపట్టాల్సిన చర్యలపై ఆరా తీశారు. అలాగే చినరావూరు కమ్యూనిటీ హాల్‌లో అసంపూర్తిగా మిగిలిన పనులను పరిశీలించారు. పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. ఆమె వెంట కౌన్సిలర్ కుర్రా సుజాత, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ, వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా శ్రీను, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పార్కు సేవలు ఉపయోగించుకోండి

మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



కార్మికులతో మాట్లాడుతున్న లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: చినరావూరు పార్కు సేవలను ప్రజలందరూ ఉపయోగించుకోవాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పిలుపునిచ్చారు. చినరావూరులోని మున్సిపల్ పార్కును శనివారం ఆయన పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆట వస్తువులను పరిశీలించి పలు సూచనలు చేశారు. వాటిల్లో కొన్ని పాడైపోవడాని గమనించిన ఆయన బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, హార్టికల్చర్ ఆఫీసర్ శేషుబాబు, పలువురు వాకర్స్ పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌తో కక్షిదారులకు మేలు



లోక్ అదాలత్‌లో కక్షిదారులతో మాట్లాడుతున్న 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు

తెనాలిరూరల్: కేసుల సత్వర పరిష్కారం కొరకు లోక్ అదాలత్ చక్కటి వేదిక అని, తద్వారా కక్షీదారుల సమయం, ధనం ఆదా అవుతుందని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు చెప్పారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనలు మేరకు శనివారం స్థానిక న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. అధ్యక్షత వహించిన న్యాయమూర్తి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుతం నమోదు అవుతున్న కేసుల్లో చాలా వరకు కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం అవుతాయని కానీ కక్షిదారులు అనవసరమైన భేషజాలకు వెళ్లి సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకుంటున్నారని అన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 669 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 100 సీవీలు, 562 క్రిమినల్, ఏడు ప్రి లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ. 5,27,04,000 పరిహారం కింద అందించారు. పోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి ఎం. ఇందిరా ప్రియదర్శిని, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆక పవన్ కుమార్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వివేక్ వర్ధన్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి. రాజశేఖర్ , లోక్ అదాలత్ మెంబర్లు కేవీఎల్ ప్రభావతి, ఖాదర్‌హుస్సేన్, సీహెచ్. శారదా, జి. వెంకయ్య, రావూరి దయాకిరణ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బేతాళ ప్రభాకర్, వైస్ ప్రెసిడెంట్ అన్నం పిన్నారావు ,సెక్రటరీ హరిదాసు గౌరీ శంకర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు ఆర్థికసాయం



తెనాలి: అనారోగ్య కారణంగా కొద్దిరోజులుగా వృత్తిని కొనసాగించలేక ఇంటివద్దనే విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ ఫొటోగ్రాఫర్ ఎస్ఎస్ఎస్ రాముకు వీడియోగ్రాఫర్ అండ్ ఫొటోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ శనివారం రూ.10 వేల ఆర్థికసాయం, బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యావసరాలను అందజేసింది. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సుద్దపల్లి సాంబయ్య, కార్యదర్శి బాబీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి సునీల్, ఉపాధ్యక్షుడు గౌతమ్, కుర్రా మహేష్, సిద్దుల సాయినాథ్, జొన్నాదుల మణి, గిరి, వేము రామరాజు, విజయ్, వసంత్ పాల్గొన్నారు.

బాగా చదువుకోండి.. ఉన్నత స్థితికి చేరండి

తహసీల్దార్ గోపాలకృష్ణ



విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, కౌన్సిలర్ సంధ్యారాణి

తెనాలిఅర్బన్: బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. అమరావతి కాలనీ గృహ యాజమానుల సంక్షేమ సంఘం, యునెస్కో క్లబ్ ఆఫ్ అమరావతి సీమ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరానగర్ కాలనీలోని మున్సిపల్ స్పెషల్ ఎలిమెంటరీ మోడల్ స్కూల్‌లోని విద్యార్థులకు శనివారం నోటుబుక్స్, పలకలు, బలపాలు పంపిణీ చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు కూడా వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి, కొమరబత్తిని జయపాల్, ఎంఈవో వి.జయంతిబాబు, సంస్థ అధ్యక్షుడు గుమ్మడి నారాయణ రావు, వార్డు నాయకులు మట్లపూడి రాజేశ్వరరావు, బాబురావు, రామోహనరావు, వెంకటేశ్వర్లు, నన్నె సాహెబ్, అప్పారావు పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే విద్యుత్ స్మార్ట్ మీటర్లు

- స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి
- సీపీఐ నాయకులు చెరుకుమల్లి సింగారావు, మద్దినేని కిరణ్‌బాబు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తెనాలి: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ పార్టీ రాష్ట్ర పిలుపులో భాగంగా శనివారం తెనాలి చినరావూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన నినాదాలు చేశారు. అనంతరం సబ్‌స్టేషన్ కార్యాలయంలో తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇప్పటికే విద్యుత్ చార్జీలను పెంచి, అదనపు చార్జీలను మోపుతూ వినియోగదారుల నడ్డి విరుస్తోందని సీపీఐ నాయకులు విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఆలోచన విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని, బలవంతంగా బిగిస్తే సీపీఐ చూస్తూ ఊరుకోదని అన్నారు. మోదీ ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గి రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే స్మార్ట్ మీటర్లను రంగంలోకి తీసుకొచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ కొల్లిపర మండల కార్యదర్శి బాలస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు పాశం వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు గండు శివ, ఏఐవైఎఫ్ తెనాలి అధ్యక్ష, కార్యదర్శులు కుంభ రవితేజ, బిళ్ల రాజేష్, ఏఐఎస్ఎఫ్ తెనాలి అధ్యక్షుడు చెన్నూరు సాయి, పవన్, తేజ,యశ్వంత్ పాల్గొన్నారు.

స్టీల్ వాటర్ డ్రమ్ము వితరణ



తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు కోణిజేటి రమేష్ కృష్ణ పుట్టిన రోజును పురస్కరించుకుని ఐతానగర్‌లోని డగ్లస్ మెమోరియల్ రెసిడెన్షియల్ ఎలిమెంటరీ స్కూల్‌కు శనివారం స్టీల్ వాటర్ డ్రమ్మును ఉచితంగా ఇచ్చారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లయన్ నేరెళ్ళ వెంకట కృష్ణమోహన రావు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు లయన్ కాకరపర్తి సుబ్రమణ్యం, నాయకులు లయన్ అయినాల మల్లేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు చావాలి సువర్ణలత, ఎ.సుజాత, ఎస్.లలితకుమారి, కె.వెంకటరెడ్డి, కర్రా జాకబ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రి మహోత్సవాలు



సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు

తెనాలిటౌన్: మండలంలోని నందివెలుగు గ్రామంలో కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో గత నెల 26 నుంచి జరుగుతున్న శ్రీ వారాహిదేవి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. భక్తుల సహాయ సహకారాలతో అర్చకులు గోపరాజు హేమంత్‌వర్మ ఆధ్వర్యంలో చివరిరోజు అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమార్చనలు, వారాహి యంత్రార్చన హోమాలు జరిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కొలకలూరి శ్రీనివాసశర్మ, బాల విశ్వనాథశర్మ, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

దళిత మైనర్ బాలికపై అత్యాచారంపై ...

- మానవ హక్కుల కార్యకర్త, న్యాయవాది కేజీ ప్రశాంతరెడ్డి ఫిర్యాదు
- తగిన చర్యలు తీసుకోవాలంటూ జిల్లా పోలీసులకు ఆదేశాలు

తెనాలి: అనంతపురం జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లి గ్రామానికి చెందిన దళిత మైనర్ బాలికపై 14 మంది వ్యక్తులు ఆరునెలలపాటు పదే పదే సామూహిక అత్యాచారం చేసిన దారుణంపై తెనాలికి చెందిన మానవ హక్కుల కార్యకర్త, న్యాయవాది కేజీ ప్రశాంతరెడ్డి స్పందించారు. ఈ ఘటనపై పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా క్వాషి-జ్యుడీషియల్ బాడీకి ఫిర్యాదుచేసి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా పోలీసులకు ఆదేశాలు జారీ అయినట్టు శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలియజేశారు.

అధికారిక సమాచారం ప్రకారం, మైనర్‌బాలిక, ఆమె తల్లిని గత నెల ఆరో తేదీన గుర్తించి రక్షించారని తెలిపా రు. బాలిక గర్భవతిగా ఉన్నందున ఆమెకు ధర్మవరం ఏరియా వైద్యశాలలో వైద్యపరీక్షలు జరిపారనీ, ఆమె స్టేట్‌మెంట్‌ను తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారని తెలిపారు. 18 మంది నిందితుల్లో 16 మందిని అరెస్ట్ ఏసీ రిమాండుకు కూడా పంపారని వివరించారు. బాధితురాలికి శాశ్వత న్యాయసహాయం, మానసిక, రక్షణ సహా యం కొనసాగించాల్సిన అవసరం ఉందని ప్రశాంతరెడ్డి అభిప్రాయపడ్డారు. అలాగే కేసును దాచిపెట్టే ఏ ప్రయత్నాన్నైనా తీవ్రంగా తీసుకోవాలని సూచించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన



స్మార్ట్ మీటర్లను పగలగొడుతున్న నాయకులు

తాడేపల్లి రూరల్: విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని కోరుతూ సీపీఐ నాయకులు శనివారం తాడేపల్లిలోని సులకపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పెంచిన విద్యుత్ ఛార్జీలు, అదనపు సబ్ ఛార్జీల పేరుతో ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని అన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగించిన విధానాలను ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆచరిస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఆలోచనా విధానాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి మునునూరు సుహాస్, తుడిమెల్ల వెంకటయ్య, నాయకులు మానికొండ డాంగే, షేక్ బాషా, కాశీలం, శీలం శ్యామ్, అనీల్, రాజా, ప్రసాద్, ప్రసన్న కుమార్, బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: ఆదానీతో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గండాలయ్యపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శనివారం స్మార్ట్ మీటర్లను పగలగొట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకోవాలని, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే వాటిని పగలగొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చిన్ని తిరుపతయ్య, అన్నవరపు ప్రభాకర్, వెంకటేశ్వరరావు, జాన్‌బాబు, బ్రహ్మేశ్వరరావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆశలపై పని భారాన్ని తగ్గించాలి



మంగళగిరి టౌన్: ఆశ వర్కర్లకు పని భారాన్ని తగ్గించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి బాలాజీ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని కొప్పురావు కాలనీ పీహెచ్‌సీలో శనివారం ఆశ వర్కర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన ఆశాల నియామకం చేపట్టాలని, ఆశ వర్కర్లను పర్మినెంట్ చేయాలని కోరారు. ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కొప్పురావు కాలనీ పీహెచ్‌సీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలువురు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా రామ్‌విలాస్ పాశ్వాన్ జయంతి



నివాళులర్పిస్తున్న లోక్‌జనశక్తి పార్టీ నాయకులు

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని రాష్ట్ర లోక్‌జనశక్తి కార్యాలయంలో శనివారం రాష్ట్ర లోక్‌జనశక్తి పార్టీ వ్యవస్థాపకులు, మాజీ కేంద్ర మంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్ 79వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. రామ్‌విలాస్ పాశ్వాన్ కేంద్ర మంత్రి వర్గంలో వివిధ శాఖలను సమర్థవంతంగా నిర్వహించారని అన్నారు. రైల్వే మంత్రిగా ఒక కలం పోటుతో 56 వేల మంది కార్మికులను పర్మినెంట్ చేశారని గుర్తుచేశారు. ఆహార శాఖ మంత్రిగా వన్ నేషన్ – వన్ రేషన్ ఉద్దేశ్యంతో దేశం మొత్తం ఒకే రేటు, ఒకే రేషన్ విధానాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చందోలు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు చింతా వెంకటేశ్వరరావు, దళిత ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు రాజామణి, ఎస్సీ, ఎస్టీ రైట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుమంచి రామారావు తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతతోనే దోమల నియంత్రణ

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టు పక్కల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని.. దీంతో దోమలను నియంత్రించవచ్చని సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని అమీనాబాద్ గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి గాబులు, నీటితొట్లు పరిశీలించారు. ఎక్కువ రోజులు నీరు నిలువ లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులు, పలు రికార్డులను పరిశీలించారు.

చివరి రోజూ తప్పని తిప్పలు!

సదరన్ స్లాట్ దరఖాస్తు చేసేందుకు పడిగాపులు



మీసేవా సెంటర్ వద్ద పడిగాపులు కాస్తున్న దరఖాస్తు దారులు

మంగళగిరి టౌన్: శారీరక వైకల్యం ఉన్నవారు.. దృష్టి, వినికిడి లోపాలతో పాటు మానసిక దివ్యాంగులు సదరన్ సర్టిఫికెట్ కోసం స్లాట్ బుక్ చేసుకునేందుకు పాట్లు పడుతున్నారు. శనివారంతో దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరి రోజు కావడంతో మంగళగిరి నగర పరిధిలోని అన్నపూర్ణ థియేటర్ ఎదురుగా ఉన్న మీసేవా సెంటర్ వద్ద పడిగాపులు కాశారు. ఈ సందర్భంగా పలువురు దరఖాస్తుదారులు మాట్లాడుతూ.. ఉదయం మీసేవా కేంద్రం తెరచిన దగ్గర నుంచి వేచి ఉన్నామని, సాయంత్రం అయినా సర్వర్ పనిచేయడం లేదని, భోజనం చేయకుండా ఇక్కడే పడిగాపులు కాస్తున్నామని అన్నారు. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు చాలా ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ సమస్య వచ్చినా వాలంటీర్లు ఇంటికి వచ్చి సమస్యను పరిష్కరించేవారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో మున్సిపల్ కార్యాలయం, మీసేవా సెంటర్ల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు.

నగరంలో పారిశుద్ధ్యం అధ్వానం

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. ఏ వీధిలో చూసినా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కాలువల్లో తిరిగే పందులు పిల్లలపై దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో పిల్లలు పాఠశాలలకు వెళ్లాలంటే బెంబేలెత్తిపోతున్నారు. నగరంలో ఖాళీ స్థలాలు అడవులను తలపిస్తూ పందులకు నిలయంగా మారాయి. ఈ ఖాళీ స్థలాలకు పన్నులు వేస్తున్న అధికారులు వాటి పరిశుభ్రత విషయంలో స్పందించకపోవడం గమనార్హం. నగరంలో సుమారుగా 1200 ఖాళీ స్థలాలకు పన్నులు వసూలు చేస్తున్న రెవెన్యూ విభాగం అధికారులు ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచడంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు ఖాళీ స్థలాలను శుభ్రంగా చేయడంతో పాటు పందులు, గోవులు తిరగకుండా చర్యలు తీసుకుని నగర ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరుతున్నారు. కమిషనర్ అలీంబాషా మాట్లాడుతూ.. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.